మడుగు కాదు రోడ్డే..!

మండలంలోని చీలాపల్లె క్రాస్ నుంచి నరసింగరాయుని పేటకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో అడుగుకోగుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 189.కొత్తపల్లె విద్యుత్తు ఉపకేంద్రం ఎదురుగా, పాపిశెట్టిపల్లె, ఎస్సీ కాలనీ, చీలాపల్లె గ్రామ సమీపంలో పెద్ద గుంతలు ఉన్నాయి. వీటిలో వర్షపు నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ దస్తగిరిని వివరణ కోరగా.. చీలాపల్లె క్రాస్ నుంచి నరసింగరాయనిపేట వరకు దెబ్బతిన్న రోడ్డు మరమ్మతుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే బాగు చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, గుడిపాల



డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సిందే

స్వామీజీల డిమాండ్

తిరుపతి(బైరాగిపట్టెడ): ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ సీఎం జగన్ రాక్షస ప్రభుత్వం అనడాన్ని స్వామీజీలు, సాధువులు, హిందూ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. జగన్ ఎప్పుడు తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకోవాలన్నా డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సిందేనని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి పేర్కొన్నారు. శనివారం సాధువులు, స్వామీజీలు, హిందూ సంఘాల నేతలతో కలిసి ఆయన అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్ద పూజలు చేశారు.


పూజలు చేస్తున్న సాధువులు, స్వామీజీలు

ఈదేస్తాం.. అనారోగ్యాన్ని జయిస్తాం

అవిశ్రాంత సాధకులు .... ఏడు పదుల వయసులోనూ హుషారుగా ఈత

ఆదివారం ప్రత్యేకం

70 ఏళ్లు దాటగానే వృద్ధాప్యంతో నడవడానికే ఇబ్బంది పడుతుంటారు. కీళ్లు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతుంటారు. కానీ వీరు మాత్రం ఏడు పదుల వయసులోనూ.. ఎంతో హుషారుగా ఈత కొడుతూ ఆశ్చర్యపరుస్తున్నారు. బద్ధకాన్ని వదిలించుకుని ఆరోగ్యకర జీవనం కోసం ఏదో ఒక వ్యాయామాన్ని అలవాటు చేసుకుని నిత్యం సాధన చేయాలని సూచిస్తున్నారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు తిరుపతికి చెందిన ప్రయాగ సుబ్రహ్మణ్యం, అరుణ దంపతులు, భూపాల్ నాయుడు.

- న్యూస్‌టుడే, తిరుపతి(క్రీడలు)



రోగనిరోధక శక్తి పెంపు

2010లో నేను ఈత సాధన మొదలు పెట్టా. ఉపశమనంతో పాటు శరీరానికి సంపూర్ణమైన వ్యాయామం దొరుకుతుంది. రోజూ గంట పాటు ఈత కొట్టడంతో రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చు. అంతే కాకుండా కీళ్లు, కండరాలు, నరాలు బలపడి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈతకొలనులో అన్ని వయసుల వారు ఉండటంతో స్నేహపూర్వక బంధం ఏర్పడుతోంది. - ప్రయాగ సుబ్రహ్మణ్యం (72), ఆర్బీఐ విశ్రాంత జీఎం

ఎన్నో ప్రయోజనాలు

గత 18 ఏళ్లుగా నేను ఈత సాధన చేస్తున్నా. నేలపై చేసే వ్యాయామం కంటే నీటిలో ఈత వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. నీటిలో కాసేపు ఉంటేనే శరీరంలో 300 కేలరీలు కరుగుతాయి. అటువంటిది అరగంటపాటు ఈత కొడితే అనారోగ్యాలు దూరమవుతాయి.


- డాక్టర్ అరుణ ప్రయాగ(68), పెథాలజీ ప్రొఫెసర్

22 ఏళ్లుగా సాధన



నేను 22 ఏళ్లుగా ఈత సాధన చేస్తున్నా. మనం వాడే వాహనాలకు సర్వీసు ఎంత అవసరమో, మన శరీరానికి కూడా వ్యాయామం అంతే అవసరం. రోజూ సాధన చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటా. ఒక్కరోజు సాధన చేయక పోయినా ఏదో తెలియని వెలితిగా ఉంటుంది. నీటిలో వ్యాయామం చేయడం ద్వారా కీళ్లు, కండరాలపై ఒత్తిడి ప్రభావం ఉండదు.

- పి.భూపాల్ నాయుడు(76), వ్యాపారవేత్త

ఈ-కామర్స్‌లో సరికొత్త లికిత్‌ం

- చిన్న దుకాణాలకు బాసటగా.. యాప్ ఆవిష్కరణ
- 21 ఏళ్లకే యువ పారిశ్రామికవేత్తగా ప్రయాణం

ఈనాడు డిజిటల్, తిరుపతి: కిరాణా దుకాణాలకు బాసటగా నిలిచి.. నిత్యావసరాలను ప్రజలకు అందించేందుకు 'ట్రెండెల్' అనే యాప్ తయారు చేశాడు తిరుపతికి చెందిన కుర్రోడు. కేవలం 21 ఏళ్లకే యువ పారిశ్రామికవేత్తగా మారిన కేఎన్ లికిత్ కుమార్ కథేంటో తెలుసుకుందామా.

డిగ్రీ మొదటి ఏడాదిలో ఉన్నప్పుడే మిత్రులతో కలిసి పోషకాహారాన్ని అందించాలనే లక్ష్యంతో 'ఫ్యూజన్ హెల్త్ కేఫ్' ప్రారంభించారు. రూ.2 వేల అద్దెతో, రూ.12 వేల పెట్టుబడితో మొదలు పెట్టి ప్రచారం చేశారు. కేవలం రెండు నెలల్లోనే రూ.1.3 లక్షలకు సంపాదన పెరిగింది. మరోపక్క డిగ్రీ పూర్తి చేశారు. కొంతకాలం తరువాత తెలిసిన వాళ్లకు కేఫ్ అదెకిచ్చి, నూతన ఆవిష్కరణలు చేయాలనుకున్నాడు. కిరాణా దుకాణాల కోసం ఏదైనా యాప్ చేయాలనుకున్నాడు. బెంగళూరులోని యాప్ డెవలప్ కంపెనీలో చేరాడు. పూర్తి అవగాహన పెంచుకుని, 4 నెలలకే ఉద్యోగం వదిలేసి ఇంటిబాట పట్టాడు.


సిబ్బందితో లికిత్

ఒక్కసారిగా కుప్పకూలిపోయింది

అంతా బాగుందనుకున్న సమయంలో యాప్ సామర్థ్యం తట్టుకోక 2024 జనవరి చివర్లో క్రాష్ అయింది. సేవలు నిలిచిపోవడంతో వినియోగదారుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యాయి. యాప్ గురించి సామాజిక మాధ్యమాల్లో చూసిన తిరుపతి ఐఐటీ విద్యార్థులు పలువురు లికిత్‌ను సంప్రదించారు. ఉచితంగా యాప్‌ను డెవలప్ చేశారు.

ప్రతి దుకాణానికి వెళ్లి..

2021 ఆగస్టు నుంచి ట్రెండెల్ యాప్ ఆవిష్కరణలో నిమగ్నమయ్యాడు. 2023 అక్టోబర్‌లో పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి తీసుకొచ్చాడు. ప్రారంభంలో ప్రతి దుకాణానికి వెళ్లి దాని గురించి వివరించి చెప్పడం.. వాళ్లు డౌన్‌లోడ్ చేసుకొని సబ్‌స్క్రిప్షన్ తీసుకునేలా ఒప్పించేవాడు. రోజుకు మహా అయితే 20 వరకు డౌన్‌లోడ్ అయ్యేవి. అయినా నిరాశ చెందకుండా లికిత్ తన ప్రయత్నాన్ని ఆపలేదు. అలా ఒక్కరోజుకు 270 డౌన్‌లోడ్స్ వరకు తీసుకెళ్లాడు. 2024 జనవరి వరకు తిరుపతి నగరవ్యాప్తంగా 4600 మంది సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నారు.

ప్రస్తుతం ఇలా..

యాప్‌ను ప్రస్తుతం 50 వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్‌లో ఆర్డర్ పెట్టిన 30 నిమిషాల్లోనే వస్తువు దుకాణదారు నుంచి ఇంటికి చేరుతుంది. ఆన్‌లైన్‌లో లభించే వస్తువులన్నీ తిరుపతి స్థానిక దుకాణాల్లో దొరుకుతుంటాయి. దాదాపు 8 మందికి ఉపాధి కల్పించారు లికిత్. ఇప్పటివరకు తిరుపతిలోనే ఉన్న ట్రెండెల్‌ను హైదరాబాద్‌కు కూడా పరిచయం చేయాలని కృషి చేస్తున్నారు.

స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం



వడమాలపేట, న్యూస్‌టుడే: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. పవిత్రోత్సవాల్లో మొదటి రోజు యాగశాలలో హోమాన్ని నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌తో పాటు ఉత్సవమూర్తులు, అనుబంధ ఆలయాలల్లో అర్చకులు పవిత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయాధికారి శివకుమార్, అర్చకులు సూర్యకుమారాచార్యులు పాల్గొన్నారు.

అంజేరమ్మ కనుమలో.. అక్రమ తవ్వకాలు


అక్రమ తవ్వకాలు జరిపిన ప్రదేశం

వడమాలపేట, న్యూస్‌టుడే: వడమాలపేట సమీపంలోని అంజేరమ్మ కనుమలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తూ కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు వెంచర్లు రావడంతో గ్రావెల్‌కు డిమాండ్ నెలకొంది. ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా విజిలెన్స్, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. అంజేరమ్మ కనుమతో పాటు పూడి, కాయం ప్రాంతాల నుంచి ఎక్కువగా గ్రావెల్ తరలింపులు జోరుగా సాగుతున్నాయి. గత రెండు రోజులుగా అంజేరమ్మ కనుమలో భారీ యంత్రాల సాయంతో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతుండటంతో సమీపం గ్రామ ప్రజలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి వరకు మిన్నకున్న మండల అధికారులు జిల్లా అధికారుల ఆదేశాలతో అంజేరమ్మ కనుమకు పరుగు పరుగున వెళ్లారు. మండల తహసీల్దార్ జరీనా అక్రమ తవ్వకాలు జరుపుతున్న యంత్రాలను స్వాధీనం చేసుకోకుండా అక్కడ నుంచి పంపేయడం గమనార్హం.

హుటాహుటిన అనుమతులు..

అక్రమ తవ్వకాలకు పాల్పడిన ఓ వెంచర్ యాజమాన్యం మైనింగ్ అధికారుల నుంచి శనివారం సాయంత్రం హుటాహుటిన అనుమతులు పొందడం గమనార్హం. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు అందాయన్నారు.

వరసిద్ధుడి సేవలో విదేశీ భక్తులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో నిత్యం జరిగే గణపతిహోమం సేవలో రష్యా, అమెరికా, కెనడా, జర్మనీ దేశాలకు చెందిన సుమారు 45 మంది భక్తులు శనివారం ఉదయం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, స్థానాచార్యులు ఫణికుమార్‌శర్మ వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ ఉన్నారు.


ఆలయంలో విదేశీ భక్తులు

సర్వదర్శనానికి 15 గంటలు


శ్రీవారి ఆలయం వద్ద వర్షపు నీరు (భక్తులు)

తిరుమల: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా శనివారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటలు పడుతోంది. శుక్రవారం శ్రీవారిని 64,158 మంది దర్శించుకున్నారు. రూ.3.31 కోట్ల హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది. * తిరుమలలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. శ్రీవారిని దర్శించుకుని వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు.

మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు నివారించాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మొగిలి ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతీయ రహదారులు, రవాణాశాఖ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఘాట్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటుతో పాటు అంబులెన్స్ వాహనం, క్రేన్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ ప్రాంతాన్ని డేంజర్ జోన్‌గా వాహనదారులకు తెలిసేలా 200 మీటర్లకు ఒకచోట వివిధ భాషల్లో బోర్డులు పెట్టాలన్నారు. పెట్రోలింగ్ వాహనాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు బారికేడ్లను పటిష్ఠం చేయాలని సూచించారు. ఎన్‌హెచ్ఏఐ పీడీ వెంకటేశ్వర్లు, డీటీసీ నిరంజన్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శంకరనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

మార్కెట్ స్థలానికి సర్వే పూర్తి

పలమనేరు: పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫాం వద్ద అంతర్జాతీయ స్థాయి మార్కెట్ కమిటీ ఏర్పాటుకు కేటాయించిన స్థల సర్వేను అధికారులు పూర్తి చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలకు చెందిన 33 ఎకరాల స్థలంలో సరిహద్దులను శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల రీసెర్చి డైరెక్టర్ శ్రీలత, సిబ్బంది సమక్షంలో శనివారం నిర్ణయించారు. జిల్లా అధికారులు స్థల మ్యాప్ సిద్ధం చేసి సర్వే నంబర్లతో పాటు త్వరలో తమకు అప్పగించనున్నారని పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు. ఇందుకోసం యూనివర్సిటీకి మార్కెట్ కమిటీ రూ.1,45,20,000 బకాయిలు చెల్లించినట్లు చెప్పారు.


సర్వేలో పాల్గొన్న అధికారులు

సంక్షేమమ అనిపిస్తున్నారు..!

- అమలు కాని ఆహార పట్టిక
- నిర్వహణ భారమంటున్న వసతి గృహాధికారులు
- టెండరింగ్ విధానం మేలంటున్న అధికారులు


భోజనం తింటున్న వసతి గృహ విద్యార్థులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే

ప్రభుత్వ వసతి గృహాల్లో ఆహార పట్టిక సక్రమంగా అమలు కాకపోవడంతో విద్యార్థుల కడుపు నిండడం లేదు. మరోవైపు నిత్యావసర సరకుల ధరల పెరిగాయని ఆ ప్రకారం ఛార్జీలు పెంచి మెనూ మార్చాలని సంక్షేమాధికారులు పేర్కొంటున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నామని వాపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ విధానాలతో అస్తవ్యస్తంగా సాగుతున్న వసతి గృహాల నిర్వహణను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

విభాగం	ఎస్సీ	ఎస్టీ	బీసీ
వసతి గృహాలు	57	4	38
విద్యార్థులు	3500	258	2382

జిల్లాలో 99 ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలున్నాయి. వాటిలో 6,140 మంది విద్యార్థులున్నారు. 2023లో 3 నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1150, 6 నుంచి పదో తరగతి వరకు రూ.1400, పోస్టు మెట్రిక్ (కళాశాల) విద్యార్థులకు రూ.1600 ఇవ్వాలని అప్పటి వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. అంతకు ముందు ఇస్తున్న మొత్తానికి రూ.200 పెంచి కొత్త మెనూ అమలు చేయాలని సూచించడంతో సమస్య తలెత్తింది.

సాధారణ భోజనమే..

జిల్లాలోని చాలా వసతి గృహాల్లో సాధారణ భోజనమే పెడుతున్నారు. అన్నంతో తయారు చేసిన పులిహోర వంటి అల్పాహారమే అందిస్తున్నారు. గత ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం పెట్టాలంటే ఒక్కో విద్యార్థికి అదనంగా రూ.500 వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఇవేమీ పట్టించుకోకుండా ఆహార పట్టిక నిర్ణయించారని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

టెండర్ల విధానమే మేలు..

రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిత్యావసర సరకులన్నీ టెండర్ల ద్వారా గుత్తేదారులకు అప్పగించారు. సరఫరా చేసే సరకుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. బిల్లులు ఆలస్యమైనా సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నారు. వసతి గృహాల్లో మాత్రం సంక్షేమాధికారులు అన్నింటినీ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. తక్కువ కొనుగోలు చేసి ఎక్కువ మొత్తంలో లెక్క చూపుతున్నారని, బడ్జెట్ విడుదలైనప్పుడు రెండు మూడు నెలల బిల్లులు ఒకేసారి పెడుతుండడంతో ధరల్లో వ్యత్యాసం ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితి ఉన్నట్లు సంబంధిత అధికారి స్పష్టం చేశారు.

ఉదయం అన్నం పెడుతున్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. ఉదయం అన్నం పెడుతున్నారు. మూడు, నాలుగు రోజులకు ఒకసారి గుడ్డు, అరటిపండు ఇస్తున్నారు. - విద్యార్థులు, బీసీ సంక్షేమ వసతి గృహం, చిత్తూరు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఆహార పట్టిక ప్రకారం మెనూ అమలు చేయడంలో ఇబ్బందులున్నాయి. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి టెండర్ విధానాన్ని అమలు చేస్తాం. - రాజ్యలక్ష్మి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి

చౌక దుకాణ డీలర్ల భర్తీకి 7న ప్రకటన

చిత్తూరు (మిట్టూరు): పునర్విభజన ప్రక్రియలో భాగంగా జిల్లాలో 49 చౌక దుకాణాలు పెరగనున్నాయి. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 400, కొత్తగా ఏర్పాటయ్యే 49 దుకాణాలకు డీలర్ల పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో భాగంగా అక్టోబరు 7న నోటిఫికేషన్‌ను ఆర్డీవోలు విడుదల చేయనున్నారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ తెలిపారు. అక్టోబరు 22న రాత పరీక్ష, 25న మౌఖిక పరీక్ష, 27న ఎంపిక జాబితాను ప్రకటిస్తారని వివరించారు.

స్విమ్స్ పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ యూనివర్సిటీ 2024-25 విద్యా సంవత్సరానికి బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ(పారా మెడికల్) కోర్సులకు మూడో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్.బిట్లా తెలిపారు. అక్టోబరు 2 నుంచి 3వ తేదీ వరకు స్విమ్స్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన లింకు ద్వారా కోర్సుల ఎంపిక చేసుకోవాలని సూచించారు.

భక్తులకు అసౌకర్యం కలగకూడదు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక అన్నమయ్య భవనంలో ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో శ్రీధర్, జేఈవో వీరబ్రహ్మం తదితరులతో కలిసి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.

దీపావళికి మహాశక్తి

- ఏటా ఉచితంగా మూడు సిలిండర్లు
- జిల్లావాసులకు రూ.136.41 కోట్ల లబ్ధి

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇచ్చిన హామీ ప్రకారం..సామాజిక భద్రతా పింఛన్లు పెంచారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఈ దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందించడానికి చర్యలు చేపట్టింది. జిల్లాలోని 46 ఏజెన్సీల పరిధిలో 6,87,336 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఆరు నెలల కిందట 'ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన'లో భాగంగా జిల్లాలో 6 వేల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు.



ప్రతి కుటుంబానికీ ప్రయోజనం

ప్రస్తుతం సిలిండరు ధర రూ.837 ఉంది. కేంద్రం సిలిండరుకు రూ.10.62 రాయితీ జమ చేస్తోంది. నలుగురు సభ్యులున్న కుటుంబం ఎంత పొదుపుగా వాడినా రెండు నెలలకు మించి వచ్చే అవకాశం లేదు. కొన్ని కుటుంబాలకు 40-45రోజులకే అయిపోతుంది. ఈ లెక్కన ఏడాదికి ఆరు నుంచి ఎనిమిది సిలిండర్లు అవసరమవుతాయి. ప్రభుత్వం మూడు సిలిండర్లు ఉచితంగా అందించడంతో ప్రజలపై సగం ఆర్థిక భారం తగ్గుతుంది. ఇలా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2,511 ఆదా కానుంది.

కార్డుదారులకు ఉపశమనం

జిల్లాలో 5.43 లక్షల బియ్యం కార్డులు ఉన్నాయి. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల చొప్పున వినియోగదారులకు అందించనున్న నేపథ్యంలో రూ.136.41 కోట్లు ఉపశమనం లభించనుంది.

- జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు: 46
- మొత్తం గ్యాస్ కనెక్షన్లు: 6,87,336
- ఏడాదికి ఉచితంగా ఇవ్వనున్న సిలిండర్లు: 16,29,750
- జిల్లా ప్రజలకు చేకూరనున్న లబ్ధి: రూ.136.41 కోట్లు

పుంజుకుంటున్న టమాటా ధరలు

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



పుంగనూరు టమాటా మార్కెట్లో రవాణాకు సిద్ధం చేసిన ట్రేలు

పుంగనూరు, న్యూస్‌టుడే: టమాటా ధరలు పుంజుకోవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో 15 కిలోల టమాటా ట్రే రూ.170 నుంచి రూ.200ల వరకు పలకగా ప్రస్తుతం రూ.450 నుంచి రూ.500 వరకు ధర పలుకుతోంది. గత ఏడాది ఈ సీజన్‌లో టమాటా ఒబ్బిడి చేసేందుకు కూడా గిట్టుబాటు కాక రైతులు దిగాలు పడ్డారు. ఈ 20 రోజులుగా ధరలు పెరుగుతూ వచ్చాయి. ఆదివారం పుంగనూరు మార్కెట్‌లో కిలో టమాటా సరాసరి రూ.35కు చేరుకుంది. పదిహేనేళ్ల క్రితం నియోజకవర్గంలో సీజన్‌లో మాత్రమే టమాటా సాగు చేసేవారు. ప్రస్తుతం ఏడాదంతా సాగులో ఉంటోంది. ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులకు ధరలు లాటరీలా తయారయ్యాయి. ఫలితంగా రైతులు అప్పుల పాలవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలతో రైతులు ఊరట చెందుతున్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గడంతో పాటు తమిళనాడులో పంట లేకపోవడంతో అక్కడి వ్యాపారులు రావడంతో టమాటా ధరలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం పుంగనూరు, పలమనేరు, వి.కోట మార్కెట్లకు 400 నుంచి 500 టన్నుల వరకు వచ్చే టమాటాలు ప్రస్తుతం వంద టన్నుల లోపే వస్తున్నాయి. మరో 15 రోజుల పాటు ధరలు పెరగడం ఖాయమని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. రైతులు కొత్తగా టమాటా నాటడానికి ఆసక్తి చూపుతున్నారు. కరవు రైతులను ఆదుకోవడంలో భాగంగా టమాటా రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. ఈ ధరలతో పెట్టుబడులు దక్కడంతో పాటు కొంత ఆదాయం చేకూరుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఈ వారంలో టమాటా మార్కెట్లో 10కిలోలు పలికిన ధరలు, వచ్చిన దిగుబడులు

ధరలు (రూ.లలో)	దిగుబడులు (టన్నుల్లో)
250–290	76
215–270	94
235–275	88
230–300	72
265–330	90
250–320	75
310–350	85
360–400	70
450–500	65

గిట్టుబాటు దక్కుతోంది

టమాటా ధరలు తగ్గుముఖం పట్టి మళ్లీ పుంజుకోవడంతో గిట్టుబాటు దక్కుతోంది. మొదట్లో ఉన్న ధరలతో నష్టాలు తప్పవని నిర్ణయించుకున్నా. 20 రోజుల్లో ధరలు పెరుగుతున్నాయి. మరికొన్ని రోజులు ఇలాగే ఉంటాయని వ్యాపారులు తెలిపారు. దీంతో తోటల్లో అంతర పనులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగిస్తున్నాం. - రామచంద్ర, రైతు

కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్



జస్టిస్ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు (న్యాయవిభాగం), న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలని హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనాల సముదాయంలో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులతో రెండు రోజుల కార్యశాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విభాగాలకు ప్రాధాన్యమిస్తూ లోటుపాట్లను సవరించుకుని.. ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్లుగా ఏపీ జుడీషియల్ అకాడమీ సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్ శ్రీనివాసరావు, విశ్రాంత జిల్లా ప్రధాన న్యాయమూర్తులు అన్వర్‌బాషా, రాటకొండ మురళీ వ్యవహరించారు. ఎక్కువ కేసులు పరిష్కరించిన న్యాయమూర్తులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు సత్కరించారు. జిల్లా న్యాయమూర్తులు రమేష్, శాంతి, శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్	215
బ్రాయిలర్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195





అడుగుకో గొయ్యి..

నగరంలోని పలు కాలనీ రోడ్లు గోతులమయంగా మారాయి. కనీసం అడుగు వేయాలన్న ఇబ్బందిగా మారింది. ప్రధానంగా నగరంలోని గురునగర్ కాలనీలో రోడ్లపై పడ్డ గోతులతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాదాచారులు అడుగు వేయాలన్నా ఇక్కట్లే. రోడ్డుకు మరమ్మతులు చేయాలని నగర వాసులు కోరుతున్నారు. – ఈనాడు, చిత్తూరు.

చిత్తూరులో 78.4 మి.మీటర్ల వర్షం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం రాత్రి జిల్లాలోని 22 మండలాల్లో భారీ నుంచి తేలికపాటి వర్షాలు కురిశాయి. అత్యధికంగా చిత్తూరులో 78.4 మి. మీటర్లు కురవగా.. అత్యల్పంగా శాంతిపురంలో 1.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. తవణంపల్లె మండలంలో 62.2 మి.మీటర్లు, ఐరాల 56.4, పూతలపట్టు 52.4, గంగాధరనెల్లూరు 40.2, గుడిపాల 30.0, పుంగనూరు, చిత్తూరు రూరల్ 28.6, సదుం 24.2, యాదమరి 22.0, బంగారుపాళ్యం 17.2, చౌడేపల్లి 13.4, పెద్దపంజాణి 12.4 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

కుల ధ్రువపత్రాలిచ్చి ఆదుకోండి

పలమనేరు, న్యూస్‌టుడే: తమ కులానికి ప్రభుత్వం ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని పిరమలైకలర్ కుల సంఘ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. శనివారం రాజధానిలో ఆయన్ను కలిసి రూ.50,116 చెక్కును వరద బాధితుల కోసం అందించారు. ఈ సందర్భంగా సమస్యను విన్నవించారు. కుల ధ్రువపత్రాలు లేక తమ పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం వారు ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ఉండవల్లి ప్రజాదర్బార్‌లో కలిశారు. రాష్ట్ర గెజిట్‌లో పిరమైకలర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చడానికి ప్రయత్నిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఈశ్వర్‌దేవర్, సౌందర్యరాజ్, నటరాజ్, వెంకటేష్, శివదేవర్, కుమార్‌దేవర్ పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న నాయకులు

అన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత రఘురాం కుటుంబ సభ్యులు



అన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న దాత రాజేంద్రప్రసాద్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన పి. రఘురాం, హైదరాబాద్‌కు చెందిన రాజేంద్రప్రసాద్‌లు రూ. లక్ష చొప్పున ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబుకు శనివారం అందించారు. దాతలు, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

సముద్ర స్నానానికి వెళ్లి ప్రమాదం

ఇద్దరిని రక్షించిన లైఫ్‌గార్డులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఐదుగురు స్నేహితులు శనివారం సాయంత్రం సరదాగా ఆర్.కె.బీచ్‌కు వచ్చారు. వీరందరూ సుమారు 4.30 గంటల సమయంలో సముద్ర స్నానం చేయడానికి దిగారు. పెద్ద కెరటం ధాటికి వారిలో ఇద్దరు సముద్రం లోతుల్లోకి వెళ్లిపోయారు. మిగిలిన వారు కేకలు వేయడంతో అక్కడున్న లైఫ్‌గార్డులు సకాలంలో స్పందించి నీట మునిగిపోతున్న పార్వతీపురానికి చెందిన సొమ్మూరి రంగారావు(21), చిత్తూరు జిల్లాకు చెందిన కొంపల్లి చైతన్య(21)లను రక్షించారు. లైఫ్‌గార్డులు ధనరాజు, నవీన్‌లు కౌన్సెలింగ్ చేసి వారిని పంపించారు.



నీట మునిగిన వారిని రక్షించి తీసుకున్న వస్తున్న లైఫ్‌గార్డులు

రూ.9.35 లక్షల గంజాయి స్వాధీనం

గంగవరం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం గ్రామ శివార్లలో గంజాయితో సహా నలుగురిని అరెస్టు చేసినట్లు అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, గంగవరం ఎస్సై డి.భూషణం తెలిపారు. వారి కథనం మేరకు. . గంగవరం శివార్లలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పుంగనూరుకు చెందిన పూల వెంకటమ్మ, మల్లేల రాజమ్మ, నాగభూషణం, ఆవుల రవి అనే నలుగురు వ్యాన్‌లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరి నుంచి రూ.9.35 లక్షల విలువైన 187 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక వ్యాన్, రూ.1.73 లక్షల నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. వీరు గంగవరం మండలం జడేరు నుంచి తిరుపతికి గంజాయి తరలిస్తున్నారన్నారు.



గంగవరం శివారులో పట్టుబడిన నిందితులతో ఎస్సై, తహసీల్దార్



ఊరేగుతున్న సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి

గణనాథుడికి ఘనంగా గ్రామోత్సవం

కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల ముగింపు రోజున సిద్ధిబుద్ధి సమేతుడైన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారు శనివారం వేకువజామున కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తెప్పోత్సవం అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపును తిలకించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో పి.గురుప్రసాద్, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరం బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం శ్రీవేంటకేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు చెంగల్రాజు శనివారం తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్స నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30న నగరి మున్సిపల్ సమావేశం

నగరి, న్యూస్‌టుడే: నగరి పురపాలక కార్యాలయంలో ఈ నెల 30న మున్సిపల్ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

న్యాయం చేయాలని మహిళల నిరసన



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు

నింద్ర, న్యూస్‌టుడే: నింద్ర గ్రామానికి చెందిన మందారం మహిళా సమాఖ్య సభ్యులకు స్త్రీనిధి రుణం ఇటీవల మంజూరైంది. వారిలో అముద అనే సభ్యురాలికి రుణం రాలేదు. ఈ విషయంలో సంఘానికి సంబంధం లేని అదే గ్రామానికి చెందిన రాష్ట్ర దివ్యాంగుల సంఘం కార్యదర్శి ఉమాపతిపిళ్లై, కృష్ణమూర్తి, జయసుధ జోక్యం చేసుకున్నారు. వారు చెప్పిన వారికే రుణం మంజూరు చేయాలని ఒత్తిడి చేశారని మందారం మహిళా సమాఖ్య సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పది రోజులుగా సంఘ సభ్యులకు, సంఘంతో సంబంధం లేని వారికి వాగ్వాదం జరుగుతోంది. దీంతో సభ్యురాలైన కీర్తన తల్లి కళావతి ఓపిక నశించి శనివారం విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు నగరి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. ఆత్మహత్యకు కారణమైన వారిపై కేసు నమోదు చేయాలని మహిళా సమాఖ్య సభ్యులు పోలీస్‌స్టేషన్ తిరుగుతున్నా పట్టించుకోలేదని ఆరోపిస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న నగరి రూరల్ సీఐ భాస్కర్ అక్కడికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

విద్యుత్తు ప్రమాదంలో ఆవు మృతి.. గ్రామస్థుల ధర్నా.. కార్వేటినగరం, : కార్వేటినగరం తూర్పు దళితవాడలో విద్యుత్తు నియంత్రికకు అమర్చిన తీగలు తగిలి గ్రామానికి చెందిన సుశీలమ్మ ఆవు శనివారం మృతి చెందింది. ఆగ్రహించిన గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. విద్యుత్తుశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆవు మృతి చెందిందన్నారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అధ్వానంగా కాలనీలు..

పట్టించుకోని పాలకులు

● విజృంభిస్తున్న దోమలు ● రోగాలబారిన పడుతున్న ప్రజలు ● ఇదీ పుత్తూరు పురపాలక పరిస్థితి

పుత్తూరు, న్యూస్‌టుడే: అదో బహుళ అంతస్తుల భవనాలున్న ప్రాంతం. ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టి రెండేళ్లు కూడా కాలేదు. ఆ వీధిలో అన్నీ సౌకర్యాలు కల్పించారు. కాని కొన్ని కాలనీల్లో మాత్రం 40 ఏళ్లుగా మట్టి రోడ్డు ఉన్నా నేటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదీ పుత్తూరు పట్టణంలోని పలు కాలనీల దుస్థితి. ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తప్ప మిగిలిన రోజుల్లో కన్నెత్తి చూడటం లేదు. వీధిలోకి రావాలంటే బురదలో అడుగేయాల్సిందే. నిత్యం వ్యాధులు ఆ వీధులను చుట్టుముడుతున్నాయి. అయినా పుర పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం గమనార్హం.

పుత్తూరులోని పలు కాలనీల్లో పాలకులు, అధికారులు గానీ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. ప్రధాన వీధులు, ప్రైవేటు లేఅవుట్లు, ప్రైవేటు పాఠశాలలున్న చోట సీసీ రోడ్లు వేశారే తప్ప.. మిగిలిన కాలనీల్లో నేటికీ రోడ్ల నిర్మాణం చేపట్టలేదు. దీంతో కాలనీల్లో ఎక్కడ పడితే అక్కడ మురుగు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. సమస్యను ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. నూతన ప్రభుత్వం అయినా తమ సమస్యలు ఆలకించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పుత్తూరులోని జెండామాను ఎక్స్‌టెన్షన్ వీధిలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

తాగునీరందని పరిస్థితి..

పట్టణంలోని జెండామాను ఎక్స్‌టెన్షన్ వీధిలో ఎక్కడ పడితే అక్కడ గోతులున్నాయి. పక్కా రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, కాలువలు కరవే. ఇక్కడి ప్రజలకు తాగునీరు సక్రమంగా పంపిణీ కావడంలేదు.

గంగమాంబాపురంలో..

పట్టణ పరిధిలోని మూడో వార్డు పరిధిలోని చౌటూరు, గంగామాంబాపురం గ్రామాల్లోనూ పరిస్థితి అధ్వానంగా ఉంది. అన్ని వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది. శివారు కాలనీలకు వారానికి ఒక రోజు మాత్రమే పారిశుద్ధ్య సిబ్బంది వస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది.

ప్రజలు సహకరించాలి

అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఖాళీ స్థలాల్లో మురుగు గుంటలు ఉన్నాయి. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చాం. ప్రజలు కూడా సహకరిస్తే ఆదర్శ పురపాలికగా తీర్చిదిద్దవచ్చు.

- మంజునాథ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు



మాట్లాడుతున్న వైస్ ప్రెసిడెంట్ పల్లవి

ఆధునిక సాంకేతికతపై దృష్టి సారించాలి

పూతలపట్టు: ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతికత వైపు దృష్టి సారించాలని ఫోర్‌సిస్ ఐఎన్‌సీ వైస్ ప్రెసిడెంట్ పల్లవి అన్నారు. పి.కొత్తకోట వేము ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హెచ్‌ఆర్ క్యాంపస్ కనెక్ట్ ప్రోగ్రాంను కళాశాల ఛైర్మన్ చంద్రశేఖరనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. పోటీ ప్రపంచంలో క్యాంపస్ సెలక్షన్‌కు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. సెయిల్ ఇండియా లిమిటెడ్ హెచ్‌ఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ. . విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ మీద దృష్టి సారించాలని సూచించారు. అమరరాజ, ఆర్గానో ఎకానమీ సంస్థల హెచ్‌ఆర్‌లు రవికుమార్, అబ్దుల్‌రషీద్, కళాశాల ఛైర్మన్ చంద్రశేఖరనాయుడు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ.. యాదమరి: 'స్వర్ణాంధ్రప్రదేశ్-2024 విద్యా సంస్కరణలు' అంశంపై మండలం కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో డీకే చెరువు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. వ్యాసరచన, వక్తృత్వం, డిబెట్ పోటీల్లో పదోతరగతి విద్యార్థినులు భూమిక, హిమబిందు, స్నేహ ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారని ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి తెలిపారు.

రేబిస్‌పై అప్రమత్తత అవసరం



టీకాలు వేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: శునకాలు, పెంపుడు జంతువుల నుంచి వచ్చే రేబిస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక దర్గాకూడలిలోని బహుళ పశువైద్యశాలలో శునకాలకు రేబిస్ టీకాలు వేశారు. జేడీ మాట్లాడుతూ.. శునకాల పెంపకంలో యజమానులు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలమనేరు రోడ్డులో రేబిస్ వ్యాధిపై అవగాహన ర్యాలీ, దర్గా కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి, పశుసంవర్ధక శాఖ డీడీ సుబ్బమ్మ, నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రాయశ్చిత్త పూజలు



పెనుమూరు: కలిగిరికొండపై ప్రాయశ్చిత్త దీక్షలో నాయకులు

పెనుమూరు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ జరిగిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మండల జనసేన, భాజపా నాయకులు శనివారం కలిగిరికొండపై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు వాసుదేవనాయుడు, నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు. **చిత్తూరు (జిల్లా పంచాయతీ):** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు తెదేపా నాయకులు సంఘీభావం తెలిపారు. **వడమాలపేట:** సనాతన ధర్మ పరిరక్షణ మనందరి బాధ్యత అని జనసేన మండల అధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని అప్పలాయగుంట వినాయక స్వామి ఆలయం వద్ద దీక్షా కార్యక్రమం చేపట్టారు.

వరద బాధితులకు రూ.లక్ష సాయం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు డీడీ అందజేస్తున్న సీఆర్ తేజేశ్వర్, సీఆర్ రాజన్

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు చిత్తూరు తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఆయన కుమారుడు సీఆర్ తేజేశ్వర్ రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ఈ మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు.

పోలింగ్ బూత్ మార్పులపై సమావేశం.. నగరి: నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్‌బూత్‌లను మార్పు చేయనున్నట్లు నగరి ఆర్డీవో వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన అయిదు మండలాల తహసీల్దార్లతో చర్చించారు.



చిత్తూరు: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



వెదురుకుప్పం: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన జట్టుతో ప్రధానోపాధ్యాయిని చాముండేశ్వరి

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ భార్గవి శనివారం తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్‌లో అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన యోగా, చెస్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ఆమె పేర్కొన్నారు. **వడమాలపేట:** తిరుపతి శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో శనివారం జరిగిన అండర్-19 జూడో, రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 జూడో పోటీలల్లో జాహ్నవి, భవిత, చిన్మయి, అండర్-19 రెజ్లింగ్‌లో వరుణ్ రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికయ్యారు. **వెదురుకుప్పం:** నియోజవర్గ పరిధిలోని కార్వేటినగరం ఆర్‌కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో పాతగుంట ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు చాముండేశ్వరి శనివారం తెలిపారు.

విద్యార్థులు భగత్‌సింగ్ పోరాట పటిమ అలవర్చుకోవాలి.. పుత్తూరు: విద్యార్థులు భగత్‌సింగ్ పోరాట పటిమను అలవర్చుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. పుత్తూరులోని సీఐటీయూ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. **కార్వేటినగరం:** భగత్‌సింగ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు కేశవులు అన్నారు. మండలంలోని డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.

సహపాఠ్యాంశాల్లో విద్యార్థులు ఆసక్తి చూపాలి.. చిత్తూరు గ్రామీణ: విద్యార్థులు చదువుతోపాటు సహపాఠ్యాంశాలల్లో ఆసక్తి చూపేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్ అన్నారు. స్థానిక పీసీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర-2024 కార్యక్రమంపై విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు సోమవారం జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో సీఆర్పీ బిందు పాల్గొన్నారు.

యథావిధిగా విద్యుత్తు బిల్లుల వసూళ్ల కేంద్రాలు.. చిత్తూరు(మిట్టూరు): ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సెలవు రోజు ఆదివారం కూడా విద్యుత్తు బిల్లుల చెల్లింపు కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని విద్యుత్తు శాఖ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు శనివారం తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం.. చిత్తూరు(క్రీడలు): ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక గిరింపేట దుర్గానగర్ కాలనీలోని సొసైటీ భవనంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి విజయకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.. నగరి: మరమగ్గ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. నగరిలో శనివారం నిర్వహించిన సీపీఎం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరమగ్గ కార్మికులకు గత ప్రభుత్వంలో అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

సహాయ పాలనాధికారి తనిఖీ.. వెదురుకుప్పం: మండల తహసీల్దారు కార్యాలయాన్ని జిల్లా సహాయ పాలనాధికారి హిమవంశీ శనివారం తనిఖీ చేశారు. రెవెన్యూ దస్త్రాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దారు రమేష్‌బాబుతో కలిసి మండల పరిధిలోని మాంబేడు, పచ్చికాపల్లం తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొన్నారు.

రచనలతో హృదయాలు గెలిచారు.. పుత్తూరు: తన రచనల ద్వారా గుర్రం జాషువా తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలుగుశాఖ అధ్యాపకుడు నరసింహులు పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వీరయ్య అధ్యక్షతన తెలుగు శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి.. జీడీనెల్లూరు: ప్రభుత్వ పక్కా ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ డీఈ శంకరప్ప లబ్ధిదారులను కోరారు. మండలపరిధిలోని పలుకాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను శనివారం పరిశీలించి లబ్ధిదారులతో 'మన ఇళ్లు-మన గౌరవం' అనే కార్యక్రమంతో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో శ్రీనివాసులు, సర్పంచి సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీధర్, క్షేత్రాధికారిణి గీత పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జైలులో భద్రతపై దృష్టి పెట్టండి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా కారాగారంలో భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ మణికంఠ తెలిపారు. జిల్లా కారాగారాన్ని శనివారం ఆయన సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడారు. జైలు వ్యవస్థ ప్రజాస్వామ్యంలో ఒక భాగమని గుర్తు చేశారు. ఖైదీల భద్రతకు సంబంధించి ప్రభుత్వం, పోలీసు, జైలు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. ఖైదీలకు సురక్షితమైన, నైతిక పరిరక్షణ కల్పించడంలో అందరూ సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీల భద్రతను పరిశీలించారు. ఖైదీల ఆరోగ్యం కోసం యోగా, ధ్యానం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, జైలర్లు శంకర్‌రావు, అప్పలనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడంతో అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మండలం నుంచి ఎర్రచందనం, ఇసుక, గ్రావెల్ తమిళనాడుకు వెళ్లకుండా నిఘా పటిష్ఠం చేయాలన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం శ్రీసువర్చల సమేత ఆంజనేయస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం స్థానిక తితిదే కల్యాణ మండపంలో కన్నులపండువగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో కల్యాణ క్రతువుని శాస్త్రోక్తంగా జరిపారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామి అమవార్లను దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఉత్సవ నిర్వాహకులు గుణశేఖర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో శనివారం రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఉమ్మడి జిల్లా సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా జి.నరేష్, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా జి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎన్.రాజశేఖర్, అడ్వైజర్‌గా ఎం.రెడ్డప్పరెడ్డిని ఎన్నుకున్నారు.

నేడు వ్యవసాయశాఖ ఎన్నికలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఏపీ వ్యవసాయశాఖ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్(ఏపీఏఈఎస్ఏ) జిల్లా ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారి రవిప్రకాష్ రావు శనివారం తెలిపారు.

కలిగిరి శ్రీనివాసుడికి పూజలు

పెనుమూరు, న్యూస్‌టుడే: కలిగిరి కొండ శ్రీవేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పెరటాసి మాసం రెండో శనివారం సందర్భంగా బాలాలయంలోని స్వామివారికి అర్చకులు వాసుదేవాచార్యులు అర్చనలు, అలంకరణలు చేశారు.

మొగిలిఘాట్‌లో ప్రార్థనలు

బంగారుపాళ్యం: మొగిలిఘాట్‌లో ప్రమాదాల నియంత్రణకు మండలంలోని మాదవనగర్ వద్ద ఉన్న బ్లెసింగ్ చర్చి పాస్టర్లు శనివారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో పాస్టర్లు యోహనా, కిరణ్, జాన్‌పాల్,క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

దాబాల నిర్వాహకులకు సీఐ హెచ్చరిక

చిత్తూరు- పలమనేరు జాతీయ రహదారిలోని దాబాల నిర్వాహకులను సీఐ శనివారం హెచ్చరించారు. లారీల్లోని డీజిల్‌ను కొందరు డ్రైవర్లు దొంగిలించి దాబాల్లో తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. లారీ డ్రైవర్లు రహదారిలో నిలిపి డీజిల్ విక్రయించడానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అక్రమంగా డీజిల్ కొన్నా... లారీడ్రైవరు దాబాల ఎదురుగా లారీలు నిలిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూతలపట్టు విద్యార్థులు.. క్రీడల్లో మెరికలు

జాతీయస్థాయిలో రాణింపు

పూతలపట్టు, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయుల సలహాలతో జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న క్రీడావనరులతో సరిపెట్టుకుంటూ వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో శిక్షణ పొందుతూ సత్తాచాటుతున్నారు. ఇటీవల ఆగ్రాలో నిర్వహించిన జాతీయస్థాయి టగ్‌ఆఫ్‌వార్ పోటీలో పూతలపట్టు జడ్పీ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎమ్మెల్యే మురళీమోహన్ అభినందించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆ విద్యార్థులను అభినందించారు.

'పవన' కృషి



అత్తిమాకులపల్లెకు చెందిన దేశమ్మ, బాలాజీ దంపతుల కుమారుడు పవన్. పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి డ్రైవర్ కాగా తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి ఆటలపై ఆసక్తి ఉండటంతో గమనించిన తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయస్థాయి టగ్‌ఆఫ్‌వార్, మోడరన్ పెంటథ్లాన్ లేజర్ రన్‌లోనూ రాణించాడు. రాష్ట్రస్థాయిలో సైక్లింగ్, సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని తనదైన ప్రతిభ కనబరిచాడు. గత నెలలో ఆగ్రాలో నిర్వహించిన టగ్‌ఆఫ్‌వార్‌లో విశేష ప్రతిభ చూపారు. జాతీయస్థాయిలో రాణించడమే లక్ష్యమని చెబుతున్నాడు.

క్రీడా ఉషోదయం



ఎల్లంపల్లెకు చెందిన రేఖ, గురుస్వామి దంపతుల కుమార్తె ఉదయశ్రీ. తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి పాల వ్యాపారి. పేద కుటుంబమైనా తమ పిల్లలు బాగా చదువుకోవాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు ప్రోత్సాహం అందిస్తూ ఆర్థిక ఇబ్బందులు పిల్లలకు తెలీకుండా చదివిస్తున్నారు. ఇటీవల ఆగ్రాలో జరిగిన జాతీయస్థాయి టగ్‌ఆఫ్‌వార్ పోటీల్లో సత్తా చాటి ప్రశంసలు అందుకుంది. గుంటూరులో నిర్వహించిన సాఫ్ట్‌బాల్‌లో జిల్లా తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటింది. సాఫ్ట్‌వేర్ కావాలన్నదే లక్ష్యమని చెబుతోంది.

కఠోర దీక్షతో..



పూతలపట్టుకు చెందిన సాగర్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు భారతి(టైలర్), సుబ్రహ్మణ్యం (ఎలక్ట్రికల్ వర్కర్). సాగర్‌కు చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తి ఉండటంతో తల్లిదండ్రులు గమనించి ఆ దిశగా ప్రోత్సహించారు. రాష్ట్రస్థాయిలో సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్ పోటీల్లో రాణించడంతో గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు అందులో మెలకువలు సాగర్‌కు నేర్పి ప్రోత్సహిస్తున్నారు. జాతీయస్థాయిలో జరిగిన ఫుట్‌బాల్, టగ్‌ఆఫ్‌వార్ పోటీల్లో ప్రతిభ చూపాడు.

అభివృద్ధిపై కూటమి దృష్టి

విజయపురం, న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీవో చంద్రమౌళి పేర్కొన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ మంజుబాలాజీ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ... పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. సర్పంచులు గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రమౌళి

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



✦ గోవాలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55, 56వ ఎడిషన్లకు డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
జ: ప్రముఖ భారత దర్శకుడు శేఖర్ కపూర్

✦ 2024–2025 సంవత్సరానికి 'ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ (ఏడీపీసీ) అధ్యక్ష బాధ్యతలను ఇటీవల ఏ దేశం చేపట్టింది?
జ: భారత్

మాదిరి ప్రశ్నలు

(ఎన్‌డీఎంఏ సభ్యుడు, విభాగాధిపతి రాజేంద్రసింగ్ 2024, జులై 25న ఏడీపీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు)

✦ దేశంలోనే తొలిసారిగా ఏ ఓడరేవులో సమగ్ర వ్యవసాయ ఎగుమతి సౌకర్యాన్ని (ఇంటిగ్రేటెడ్ అగ్రి ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటీ) అభివృద్ధి చేస్తున్నారు? (ఈ ప్రాజెక్టు విలువ రూ.284.19 కోట్లు. విస్తీర్ణం 67,422 చదరపు మీటర్లు. ఈ ఓడరేవు ఇప్పటికే దేశంలో మొదటి 100 శాతం ల్యాండ్ లార్డ్ పోర్టుగా గుర్తింపు పొందింది.)
జ: జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు, ముంబయి

✦ 'వరల్డ్ హెపటైటిస్ డే'ను ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? ('ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అనేది ఈ ఏడాది థీమ్.)
జ: జులై 28

✦ దేశంలో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్ 'అప్నా రేడియో 90.0 FM' ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు?
జ: ఐజ్వాల్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అన్ని సబ్జెక్టులను చదవడానికి, రివిజన్‌కు వీలు కల్పించే విధంగా స్టడీప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల బలాలు, బలహీనతల ఆధారంగా ఆ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024

తెలుగు కంటెంట్

పదోతరగతి

తెలుగు

ప్రత్యక్ష దైవాలు



తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు!

ప్రశ్నలు జవాబులు

1) 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి గురించి రాయండి. (4 మా.)

జ: 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి ఎఱ్ఱన.

కాలం: క్రీ.శ.14వ శతాబ్దం. తల్లిదండ్రులు: పోతమ్మ, సూరనలు. జననం: పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలోని గుడ్లూరు గ్రామం). ఉద్యోగం: అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. రచనలు: రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషం, నృసింహపురాణం బిరుదులు: శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు. రచనా శైలి: సూక్తి వైచిత్రితో పేరెన్నిక గన్నది. ✦ ప్రస్తుత పాఠ్యాంశాన్ని మహాభారతంలోని అరణ్యపర్వంలోని 5వ ఆశ్వాసం నుంచి గ్రహించారు.

2) వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో 'తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి. (8 మా.)

జ: తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదని మన పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ✦ తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవాలు. ✦ వారిని కష్టపెట్టకూడదు. ✦ కేవలం అమ్మానాన్నలను పూజించడం తప్ప వేరే దైవాన్ని కూడా పూజించని ధర్మవ్యాధుడు ధర్మాత్ముడు అయ్యాడు. ✦ వేదాలు, శాస్త్రాలు చదివిన కౌశికుడి లాంటి వ్యక్తికి కూడా ధర్మసూక్ష్మాలు తెలిపాడు. ✦ మనకు శరీరాన్నిచ్చి, పెంచి, పోషించి ఒకస్థాయికి తీసుకుని వచ్చిన తల్లిదండ్రులను మించిన దైవం లేదని ధర్మవ్యాధుడు తన మాటలు, ఆచరణ ద్వారా నిరూపించాడు. ✦ తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఎంత జ్ఞానం సంపాదించినా, పుణ్య కార్యాలు చేసినా ప్రయోజనం లేదు. ✦ యజ్ఞాలు, వ్రతాలు, పూజలు అన్నీ చేసిన ఫలితం తల్లిదండ్రుల సేవ వల్ల లభిస్తుంది. ✦ ఇంట్లో కన్నవారి రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవాలను వదిలి జ్ఞానం, పుణ్యం కోసం ఎక్కడెక్కడికో వెళ్లడం వెర్రితనం.

ముఖ్యమైనవి మరికొన్ని..

8 మార్కుల ప్రశ్నలు

1) ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

2) ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జవాబుల కోసం

– చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

మనుగడకు మూలాలు.. ప్రగతి సాధనాలు!

ఇండియన్ జాగ్రఫీ

ఆధునిక ప్రపంచం మనుగడ అంతా శక్తివనరులపైనే ఆధారపడి నడుస్తోంది. విద్యుత్తు తయారీకి, వాహనాలు నడిచేందుకు, వివిధ ఉత్పత్తులకు శిలాజ ఇంధనాలే ప్రధాన ఆధారాలు. ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాల్లో వాటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, అణుశక్తికి సంబంధించిన ప్రాథమికాంశాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వాటి లభ్యత, విస్తరణ, ఉత్పత్తి తీరుతెన్నులు, ఆ కార్యకలాపాల్లో నిమగ్నమైన భారత ప్రభుత్వ సంస్థల గురించి అవగాహన కలిగి ఉండాలి.



రావత్‌భటాలోని రాజస్థాన్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌ఏపీపీ)

శక్తివనరులు

ఆధునిక యుగంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రధాన కారకం శక్తివనరు. ఏదైనా ఒక దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఇది చాలా అవసరం. ఒక ప్రదేశ ఆర్థిక అభివృద్ధి, అక్కడి శక్తిసంపద, దాన్ని వినియోగిస్తున్న విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శక్తివనరులను ప్రాథమిక స్థాయి నుంచి అంటే ఆహార పదార్థాలను వండుకోవడం నుంచి ఆధునిక స్థాయి అంటే పరిశ్రమలు, వ్యాపారం, రవాణా, సమాచార అభివృద్ధి వరకు బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తివనరులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అవి 1) వాణిజ్యేతర శక్తి 2) వాణిజ్య శక్తి. అటవీ ఉత్పత్తులు, కర్రబొగ్గు, ఆవు పేడ, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి వాణిజ్యేతర శక్తి వనరులు. నేలబొగ్గు, సహజవాయువు, జలవిద్యుత్తు, చమురు (క్రూడ్ ఆయిల్), పవనశక్తి, సౌరశక్తి, అణుశక్తి మొదలైనవి వాణిజ్య శక్తికి ఉదాహరణలు. మరోవిధంగా శక్తివనరులు రెండు రకాలు అవి-

> దేశంలో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ప్రస్తుతం 90% బొగ్గు ఉత్పత్తి ఉపరితల గనుల ద్వారా జరుగుతోంది. భారత్ బొగ్గును నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌కు ఎగుమతి చేస్తూ; ఇండోనేసియా, దక్షిణాఫ్రికాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

1) తరిగిపోయేవి: వాడిన కొద్దీ నిల్వలు తగ్గిపోతూ ఉంటాయి. పునరుత్పత్తి చేయడం కుదరదు. వీటినే సంప్రదాయ ఇంధన వనరులు అంటారు. అవి- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం.

2) తరగనివి: ఎంత వాడినా, ఎన్నిసార్లు వాడినా తరిగిపోవు. మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వీటినే సంప్రదాయేతర ఇంధన వనరులు అంటారు. అవి నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవి.

దేశంలో వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు, ముడిచమురు, అణుశక్తి, సహజవాయువు, జలవిద్యుత్తును వినియోగిస్తున్నారు. నేడు సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, జీవశక్తి (బయోఎనర్జీ) ఉత్పత్తి, వాడకమూ పెరిగింది.

సంప్రదాయ ఇంధన వనరులు

బొగ్గు: ఇంధన వనరుల్లో ప్రధానమైంది. దేశంలో జరిగే విద్యుత్తు ఉత్పత్తిలో 50% పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. ప్రపంచంలో అధిక బొగ్గు నిల్వలున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో (2023-24 - 378.21 బి.టన్నులు) ఉంది. (మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా ఉన్నాయి.) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి దేశాల్లో భారత్‌ది రెండో స్థానం (2023-24- 997.25 మిలియన్ టన్నులు). (మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో ఇండొనేసియా ఉన్నాయి.) బొగ్గును 'నల్లబంగారం' అంటారు. దేశంలో బొగ్గు నిక్షేపాలు రెండు రకాలు.

గోండ్వానా రకం నిక్షేపాలు: ఇవి కార్బోనిఫెరస్ యుగంలో ఏర్పడ్డాయి. మహానది, సోన్, నర్మద, దామోదర్ నదీ లోయ ప్రాంతాల్లో; తెలంగాణ, ఏపీలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. దేశంలోని మొత్తం బొగ్గులో 98% ఈ రకమే. నాణ్యమైన ఆంథ్రసైట్, బిట్యుమినస్ రకానికి చెందింది.

టెర్షియరీ రకం: ఇది లిగ్నైట్ రకానికి చెందింది. అస్సాం, శివాలిక్ కొండల వద్ద రాజస్థాన్, కశ్మీర్‌లో; తమిళనాడులోని కడలూర్ జిల్లా నైవేలి, గుజరాత్‌లోని కచ్ ప్రాంతాల్లో లభిస్తుంది. దేశం బొగ్గు నిల్వల్లో ఈ రకం 2% మాత్రమే.

బొగ్గు రకాలు: బొగ్గు ఏర్పడే క్రమంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, కాలం ఆధారంగా పలు రకాలుగా ఏర్పడతాయి. బొగ్గులో మందం, గట్టిదనం, తేమశాతం, బూడిద రకం వేరుగా ఉంటాయి.

ఆంథ్రసైట్: ఇది నాణ్యమైంది, దృఢమైంది. నలుపు రంగులో ఉంటుంది. ఇందులో 80% పైగా కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో లభిస్తుంది. మండేటప్పుడు నీలి రంగులో ఉంటుంది.

బిట్యుమినస్ రకం: మెత్తగా ఉంటుంది. దేశంలో అత్యధికంగా ఉన్నది ఇదే. దీనిలో కర్బనం 40-80%, తేమ 15-40% ఉంటుంది. ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌ల్లో లభిస్తుంది.

లిగ్నైట్: దీన్ని గోధుమ రంగు బొగ్గు అంటారు. 40%-50% కర్బనం, 35% తేమ ఉంటుంది. నైవేలి (తమిళనాడు), పల్నా (రాజస్థాన్), లక్ష్మీపుర్ (అస్సాం), కారేవా (జమ్ము-కశ్మీర్)ల్లో లభిస్తుంది. తమిళనాడులో లిగ్నైట్ నిక్షేపాలు అధికం.

పీట్: దీనిలో 40-50% కర్బనం ఉంటుంది. బొగ్గు తయారయ్యే క్రమంలో ఏర్పడుతుంది. దీన్ని కాల్చినప్పుడు పొగ, బూడిద ఎక్కువగా వస్తాయి.

> దేశంలో 1774లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ అనుమతితో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని 'రాణిగంజ్' వద్ద బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైంది.
>
> ప్రపంచ థర్మల్ విద్యుత్తు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి.

ముడిచమురు: పెట్రోలియం అంటే శిలాజ ఇంధనం. దీని నుంచే పెట్రోలు, డీజిల్, కిరోసిన్ లభిస్తాయి. దేశంలో మొదట అస్సాంలోని మాకూమ్ (1867)లో ముడిచమురు గుర్తించగా, అస్సాంలోని డిగ్బాయ్ (1889)లో తొలుత చమురు వెలికితీశారు. సహర్ కటియ, కాంబట్ సింధుశాఖ, బాంబే హై వద్ద పెట్రోలియం నిల్వలను గుర్తించారు. 1956లో భారత్‌లో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఏర్పడింది. నాటి నుంచి దీని పర్యవేక్షణలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత జరుగుతోంది. 2024, సెప్టెంబరు 19 నాటికి భారత్‌లో గుర్తించిన చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు. 2023-24 నాటికి వెలికితీసిన ముడిచమురు 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

> ఒక బారెల్ ముడిచమురు నుంచి 42% పెట్రోలు, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% కిరోసిన్, 4% ఎల్‌పీజీ, 18% ఇతర పదార్థాలు వస్తాయి.
>
> ప్రపంచ పెట్రోలు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా ఉన్నాయి.

సహజ వాయువు: భారత్‌లో సహజవాయువు పరిశ్రమ 1960ల్లో అస్సాంలోని డిగ్బాయ్, మహారాష్ట్రలోని ముంబయి హై ఫీల్డ్‌లో ప్రారంభమైంది. 2020-21 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం సహజవాయువు నిల్వలు 1,372.62 బి.క్యూబిక్ మీటర్లు. మొత్తం నిక్షేపాల్లో సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా, పశ్చిమ తీరంలో 23.7%, తూర్పు తీరప్రాంతాల్లో 41%గా ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం సహజవాయువులో 75% ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేస్తుంది.

అణుశక్తి: అణుశక్తికి కావాల్సినవి యురేనియం, థోరియం నిల్వలు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల తీరప్రాంతంలో ఇల్మినైట్, మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి. ఇల్మినైట్ నుంచి టిటానియం, మోనోజైట్ నుంచి థోరియం వస్తాయి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1967లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో 7 వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 24 అణువిద్యుత్తు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. 1972లో రాజస్థాన్‌లోని కోట సమీపంలో రెండో అణువిద్యుత్తు కేంద్రాన్ని రావత్‌భటాలో స్థాపించారు.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

జలాశయాలకు తాగునీటి పథకాల అనుసంధానం

● మళ్లీ తెరపైకి వాటర్ గ్రిడ్ పనులు ● ఇంటింటికి కుళాయిల ద్వారా సరఫరా



కండలేరు-పూండి కాలువ

గూడూరు, న్యూస్‌టుడే: పల్లెలకు సురక్షిత తాగునీటిని అందించే వాటర్ గ్రిడ్ పనుల వైపు రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకాన్ని వైకాపా పక్కన పెట్టేయడం.. ఫలితాలు ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజా సమీక్షలో నీటి పథకాలు జలాశయాలకు అనుసంధానించే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు నదులు, సర్వీసు రిజర్వాయర్‌లను పైపులైన్ ద్వారా అనుసంధానం చేయాల్సి ఉంది. ఇదే తీరుగా సంపులు, చెరువులు నీటితో నింపే పథకాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో ఏటా పల్లెలకు నిత్యం నీటిని అందించే అవకాశం కలుగుతుంది. చిత్తూరు జిల్లాలో 3.53 లక్షలు, తిరుపతి జిల్లాలో 3.85 లక్షల గృహాలున్నాయి. ఇవన్నీ పల్లె ప్రాంతాలు కాగా నేరుగా నీటి సరఫరా చేసే పథకాలు ఎక్కువగా ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్‌లో పెద్దఎత్తున నిధులు వచ్చినా కుళాయి కనెక్షన్ల పేరిట రూ.కోట్ల వ్యయం చేసింది వైకాపా సర్కార్. ఉన్న పథకాలు నీటి వనరులు లేక చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. నీటి వనరులు అందుబాటులో లేకుండానే వైకాపా ప్రభుత్వం ఇంటింటికి కుళాయిలు ఇచ్చింది. ఇవి చాలా చోట్ల మొక్కుబడి కాగా వాటిని సరిచేసే ప్రక్రియ తాగునీటి సరఫరా శాఖ చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ తాగునీటి పథకాలు

వివరాలు	తిరుపతి	చిత్తూరు
కాలనీలు	4,008	5,310
గృహాలు	3,85,684	3,53,147
నీటి కనెక్షన్లు	2,67,788	2,96,306
సీపీడబ్ల్యూఎస్	24	02
ఎంపీడబ్ల్యూఎస్	2,155	960
డైరెక్ట్	2,672	1,718
చేతిబోర్లు	34,958	29,516

కండలేరు నీటిని తెచ్చే ఏర్పాట్లు

ఉమ్మడి జిల్లాలోని పల్లెలకు కండలేరు నీటిని తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇలా ఆ నీటిని జలాశయాలు, చెరువుల్లో నింపి అక్కడి నుంచి ఓహెచ్ఆర్‌లకు నీటిని అందించే ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అవసరమైన కార్యాచరణను ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాలకు సుమారుగా రూ.5 వేల కోట్ల మేర వ్యయం చేయాల్సి ఉంది.

■ చిత్తూరు జిల్లాలో విజయపురం, నింద్ర మినహా ఎక్కడా సమగ్ర రక్షిత నీటి పథకాలు అందుబాటులో లేవు. ఆయా ప్రాంతాల్లో సురక్షిత నీటిని అందించే ప్రణాళిక గ్రామీణ తాగునీటి శాఖ చేపడుతోంది. చిత్తూరు పడమర ప్రాంతాల్లో రూ.2,665 కోట్ల అంచనాలతో చేపట్టిన పథకం ముందుకు కదల్లేదు. కాగా గతంలో తిరుపతి జిల్లాకు ఏమీ కేటాయించక పోగా.. ప్రస్తుతం రూ.2,400 కోట్లు అవసరం అవుతాయని అంచనా. ఇలా రెండు జిల్లాల్లో నీటి పథకాలకు అంచనాలు చేస్తున్నారు.

అంచనాలు సిద్ధం చేయాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదికలు సిద్ధం చేస్తున్నాం. అంచనాలు చేపట్టి పథక రచన చేయాల్సి ఉంది.

– విజయకుమార్, ఎస్ఈ, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ, తిరుపతి

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.


రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



RAMOJI FILM CITY



సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..

www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

చెరువు మట్టి అక్రమ తరలింపు

వైకాపా సర్పంచి వాహనాల సీజ్

ఓఎన్ కొత్తూరు(గుడుపల్లె), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరు పంచాయతీ సర్పంచి దేవప్పనాయుడు అక్రమంగా చెరువు మట్టిని తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తుండగా శనివారం తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాయి. ఎస్సై.డి.శ్రీనివాసులు వివరాల మేరకు... మండల పరిధి తమిళనాడు సరిహద్దులోని ఓఎన్. కొత్తూరు సమీపంలోని వీరప్పనాయని చెరువు నుంచి వైకాపా స్థానిక సర్పంచి దేవప్పనాయుడు తవ్వకాలు చేపట్టి తమిళనాడు వేపనపల్లె నియోజకవర్గం ప్రాంతాలకు తరలిస్తున్నాడు. పోలీసులు భాగంగా గుర్తించి వాహనాలను మట్టితో సహా స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకపోగా సర్పంచి దేవప్పనాయుడు ఆధ్వర్యంలో ఈ అక్రమ మట్టి వ్యాపారం జరుగుతున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. అక్రమానికి పాల్పడిన సర్పంచిపై కేసు నమోదు చేసి టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన సర్పంచి దేవప్పనాయుడుకి చెందిన టిప్పర్లు

పంటలపై ఏనుగుల దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాతపేట గ్రామం వ్యవసాయ పొలాలపై శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు బీభత్సం చేశాయి. గ్రామానికి చెందిన రైతు కామాటం శంకర, శేఖర్ పొలంలో వరి, వంకాయ పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. అలాగే కల్లూరు గ్రామ సమీపంలోని ఎద్దలవారిపల్లె సమీపంలోని జాతీయ రహదారిపై ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసి మధుసూదన్‌నాయుడు పొలంలోని అరటి చెట్లను ధ్వంసం చేసింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.



పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగు

చిత్తూరు జిల్లా వార్తలు

అటవీ సంపదకు రక్షణ కరవు

✷ వృథాగా రూ.కోట్ల విలువైన సంపద ✷ నిరాదరణలో అటవీ స్థలాలు

పలమనేరు, న్యూస్‌టుడే: నగరాలకు, పట్టణాలకు అత్యంత సమీపంలో ఉన్న అటవీశాఖకు చెందిన భూములు నిరుపయోగంగా ఉన్నాయి. అందులోని విలువైన వృక్షాలకు రక్షణ లేకుండా పోతోంది. ఎర్రచందనం దుంగలను సైతం గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి మాయం చేస్తున్నారు. ఇక కొన్ని చోట్ల అటవీభూముల్లో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.

చిత్తూరులోని మెసానికల్ గ్రౌండ్ సమీపంలో ఉన్న అడవి, పలమనేరు పట్టణానికి సమీపంలో ఉన్న గోరితోపులో రూ.కోట్ల విలువ చేసే ఎర్రచందనం వృక్షాలు ఉన్నాయి. వీటిపై అక్రమార్కులు దృష్టి సారిస్తుంటారు. రహస్యంగా వాటి కొమ్మలను కత్తిరించి తమిళనాడుకు తరలిస్తుంటారు. వీటి రక్షణకు సంబంధితశాఖ ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. ఇక చాలా వరకు వృక్షాలు ఎండిపోయి నేలకొరుగుతున్నాయి. అలా వాలిన ఎర్రచందనం చెట్ల నుంచి కొమ్మలను కత్తిరించేస్తున్నారు. ఈ ప్రాంతం పట్టణానికి అత్యంత సమీపంలో ఉంది. ఇక చుట్టుపక్కల గృహాల వారు ఇందులోకి మురుగు కాలువలను మళ్లించి దుర్గంధం చేస్తున్నారు.

ఇసుకను తోడేసి.. పలమనేరు-బెంగళూరు రహదారిలో క్యాటిల్‌ఫారం వద్ద కౌండిన్య నదికి ఆనుకుని అటవీశాఖకు చెందిన భూమిలో స్మగ్లర్లు ఇసుకను తోడేస్తున్నారు. నగరవనం పేరిట ఇక్కడ కొంత వరకు అటవీశాఖ అభివృద్ధి పనులు చేపట్టి అర్ధాంతరంగా వదిలేసింది. దీంతో ఇసుకాసురులు ఈ భూమిని ఆనుకుని ఉన్న నది మీదుగా ఇసుకను పూర్తిగా తోడేస్తున్నారు. ఫలితంగా వనంలోని భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి.

అటవీశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం.. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే కోసం రోడ్డు నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఇందుకోసం పలమనేరు అడవిలో అడ్డుగా ఉన్న వృక్షాలను రెండేళ్ల కిందట తొలగించి అటవీశాఖకు హైవే అధికారులు అప్పగించారు. వంద టన్నుల వరకు పట్టణంలోని గోరితోపులో భద్రపరిచారు. వేలం వేస్తే రూ.కోటి వరకు ఆదాయం వస్తుంది. రెండేళ్లుగా కలపను అలాగే వదిలేయడంతో చెదలు పట్టి పనికిరాకుండా పోతోంది. వేలం వేసినా అంత మొత్తం వచ్చే పరిస్థితి కనిపించలేదు.



గోరితోపులో నిరుపయోగంగా కొయ్యలు

కట్టుదిట్టం చేస్తాం.. గోరితోపు, రెడ్డిగుంట, రంగారెడ్డి పార్కు ఎదురుగా ఉన్న స్థలాలను నగర వనాలుగా చేసే ఆలోచనలో ఉన్నాం. అటవీ సంపదకు రక్షణ కల్పిస్తున్నాం. పర్యటించి తగు చర్యలు తీసుకుంటాం.

- చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌వో, చిత్తూరు

ట్రైలర్ వాహనం ఢీకొని మహిళ మృతి


బంగారుపాళ్యం: చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలో మొగిలి ఘాట్ రోడ్డులో లారీ దగ్ధం కాగా, మరో లారీ లోయలో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతి, ఇద్దరు గాయపడిన ప్రమాదం మరవకనే శనివారం మరో ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... బెంగళూరు నుంచి వైజాగ్‌కు ఇటాచి వాహనాన్ని తరలిస్తున్న ట్రైలర్ మొగిలి ఘాట్‌లో అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న గుర్తుతెలియని మహిళను, కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ(45) అక్కడికక్కడే మృతి చెందారు. రహదారిపై ట్రెయిలర్ బోల్తా పడటంతో ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. విషయం తెలుసుకున్న సీఐ కత్తి శ్రీనివాసులు అక్కడికి చేరుకుని బోల్తాపడిన ట్రెయిలర్‌ను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మొగిలి ఘాట్‌లో అదుపుతప్పి బోల్తా పడిన ట్రైలర్

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు క్షత్రియ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి క్షత్రియ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (29 సెప్టెంబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు** ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91547 72006 & 80080 02165** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

వ్యవసాయశాఖ జిల్లా శిక్షణ సమన్వయకర్తకు ఉద్యోగోన్నతి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉంటూ తిరుపతి జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న రత్నప్రసాద్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఆయన్ను ఉమ్మడి కర్నూలు జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సీనియర్ ఏడీఏ భాస్కరయ్యకు జిల్లా సమన్వయకర్తగా పూర్తి బాధ్యతలు అప్పగించారు.

పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. రోగులకు కంటి వైద్య నిపుణులు మురళీకృష్ణ, రహ్మత్ ఖాన్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించగా 25 మంది శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రిలో ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోవిందు, దిలీప్, రామకృష్ణారెడ్డి, వెంకటపతి, చెంగారెడ్డి, మునస్వామిమొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి క్రిష్ణదాసనపల్లి పంచాయతీ కేంద్రంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం, కుప్పం సహాయ సంచాలకులు రెడ్డికుమారి, పశువైద్యాధికారులు జయశ్రీ, ఆమని పశువులకు వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో 154 పశువులకు పిడుదల నివారణ మందులను పిచికారి చేసి, 80 పశువులు, దూడలకు నట్టల నివారణ మందులను తినిపించారు. 33 పశువులకు గర్భకోశ చికిత్సలు అందించినట్లు వైద్యులు తెలిపారు. తెదేపా నాయకులు మహేంద్ర, మురళి, సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు అవగాహన



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

పలమనేరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా వాహన తనిఖీ అధికారులు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం చిత్తూరు-బెంగళూరు నాలుగో నంబరు జాతీయ రహదారిలో పొన్నమాకులపల్లె, పత్తికొండ, జగమర్ల, మొగిలి ఘాట్ ప్రాంతాల్లో ప్రజలతో, వాహన చోదకులతో మాట్లాడారు. ప్రమాదాల నివారణ కోసం వారి నుంచి సలహాలను తీసుకున్నారు. పత్తికొండ, పొన్నమాకులపల్లె ప్రాంతాల్లో జాతీయ రహదారి మధ్య ఉన్న డివైడర్‌ను ధ్వంసం చేసి ద్విచక్ర వాహనాల్లో అడ్డదిడ్డంగా ప్రయాణించడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. కాగా పాఠశాల పిల్లలు, గ్రామస్థులు రోడ్డు దాటాల్సిన అవసరం ఉందని తమకు రోడ్డు పైభాగంలో ఇనుప బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరారు. ప్రజలు, వాహన చోదకులు ఇచ్చిన సలహాలు, సూచనలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆర్టీవో అధికారులు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎంవీఐలు మధుసూదన్, భాషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్తీ జరగలేదు

పలమనేరు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగలేదని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ చెప్పారు. శనివారం ఆయన తిరుమలలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి నేతలు లేని ప్రచారం చేస్తున్నారని అన్నారు. పలమనేరు పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకాపా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మీద తెదేపా నాయకులు తప్పుడు నిందలు వేశారని అవన్నీ ప్రక్షాళన కావాలని కోరారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధుల్లో 'రేబిస్' ప్రాణాంతకమైనదని రొంపిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డా. దినేష్‌కుమార్ అన్నారు. శనివారం 'ప్రపంచ రేబిస్ దినోత్సవం' సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేబిస్ సంక్రమణ, నివారణ చర్యలను ప్రజలకు వివరించారు. ర్యాలీలో సిబ్బంది కాంతమ్మ, పంకజాక్షి తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్వో శ్రీరాములు

పుంగనూరు, న్యూస్‌టుడే: పర్యావరణ పెంపునకు దోహదపడే చెట్లు నరికివేతకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ జి.శ్రీరాములు అన్నారు. జీవీల బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ పుంగనూరు ఎఫ్‌ఆర్వో పరిధిలో గల పుంగనూరు, పెద్దపంజాణి, చౌడేపల్లె, సోమల, సదుం మండలాల్లో చింతచెట్లు, కానుగ చెట్లు నరికి వేస్తున్నారని, ఉమాల తోటల పెంపకానికి అటవీశాఖ భూముల్లో గల వెదురు, నీలగిరి ఇతర కట్టెలు అక్రమంగా కొట్టేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అటవీ సంపద సంరక్షణ కోసం నిరంతరం ఆయా సెక్షన్ పరిధిలో నిఘా ఉంచామని పేర్కొన్నారు. ఏనుగులతో పంటలు దెబ్బతిన్న రైతులు సకాలంలో సమాచారం అందిస్తే పరిహారం త్వరితగతిన అందించేందుకు వీలుంటుందన్నారు. బట్టందొడ్డి నర్సరీలో మొక్కల పెంపకాన్ని విస్తరింప చేసి సింగిరిగుంట, సదుంలో నర్సరీలను పునరుద్ధరిస్తామని తెలిపారు. బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద రూ.1.3 కోట్లతో ఏర్పాటు చేసిన నగర వనం యాత్రికులను ఆకట్టుకుంటోందని తెలిపారు. చెట్ల నరకివేత, అటవీ సంపద అక్రమ రవాణా విషయమై తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

వ్యాధినిరోధక టీకాలు తప్పక వేయించాలి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: చిన్న పిల్లలకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధుల నివారణకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు అన్నారు. నాగిరెడ్డిపల్లెలో శనివారం వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌చందర్, సీహెచ్‌వో అనురాధ, ఫార్మసిస్ట్ సారామతి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే కుక్కకాటు ప్రమాదకరం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే మనుషులకు ప్రమాదకరమని వైద్యాధికారి విజయ్‌చందర్ అన్నారు. ప్రపంచ రేబిస్ వ్యాధి దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కుక్కకాటు గురించి ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. కుక్క కరిచిన వ్యక్తి టీకా వేయించుకోకుంటే 3 నెలల్లో రేబిస్ వ్యాధి సోకుతుందన్నారు. వ్యాధి సోకిన నాలుగు రోజులకు మరణించే అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ సావిత్రి, సీహెచ్‌వో అనురాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు వేరుసెనగే



వేరుసెనగ చెట్ల నుంచి కాయలు ఒబ్బిడి చేస్తున్న మహిళలు

పుంగనూరు, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి, వేల రూపాయలు వెచ్చించి పండించిన వేరుసెనగ పంట నామమాత్రంగానే పండింది. వర్షాధార పంటగా సాగుచేసే వేరుసెనగ పంట ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో 50 శాతం పంట కూడ సాగు కాలేదు. విత్తనాలు విత్తిన సమయంలో అవసరమైన మేరకు వర్షం కురవని కారణంగా విత్తనాలు మొలకెత్తని దుస్థితి. కొన్ని గ్రామాల పరిధిలో మొలకెత్తిన మొలకలు ఎండిపోవడం జిల్లాలోని పడమటి నియోజకవర్గాలైన పుంగనూరు, పలమనేరు, కుప్పంతో పాటు ఇతర ప్రాంతాల్లో నెలకొంది. సాగు ఖర్చులు కాదు కదా కనీసం విత్తనాలకు వెచ్చించిన పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో రైతు కంట కన్నీరు కారుతోంది. జిల్లాలో 43,174 ఎకరాల్లో వేరుసెనగ సాగుకావాల్సి ఉండగా కేవలం 13,162 ఎకరాల్లో మాత్రమే సాగైంది. దీనికి తోడు 20శాతం పంట దిగుబడులు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడ రాకపోవడంతో అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సింహ భాగం మండలాల పరిధిలో పాతిక భాగం అటవీ ప్రాంతంలోనే వేరుసెనగ సాగు చేశారు. ఒక పక్క వరుణుడు కరుణ లేకపోవడం మరోవైపు అడవి

సాగు ఖర్చులు రాని వైనం

పందులు, కోతుల బెడదతో మరింత నష్టం కలుగుతోంది. ఎకరా పంటలో కనీసం రెండు క్వింటాళ్ల దిగుబడి కూడ రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నూర్పిడి చేసి కాయలు ఒబ్బిడికి పెట్టే ఖర్చు కూడా రావడంలేదని రైతులు అంటున్నారు.

పెట్టుబడులు కూడా దక్కవు



ఎకరా వేరుసెనగ సాగుకు రూ.14 వేలు నుంచి రూ.15 వేలు వెచ్చించా. ప్రస్తుతం కాయలు ఒబ్బిడి చేస్తుండడంతో ఎకరాకు రూ.8వేల విలువచేసే కాయలు వస్తున్నాయి. దీంతో రూ.7 వేలు అప్పు మిగులుతోంది. విత్తనాలు విత్తినప్పటి నుంచి వర్షాలు లేకపోవడంతోనే పంట పూర్తిగా దెబ్బతింది. వేరుసెనగలో అంతర్ పంటగా సాగుచేసిన జొన్న, కంది, అనప, అలసంద వంటి పంటలపై ఆశలు పెట్టుకొన్నాం.

– ఆంజప్ప, రైతు, హనుమంతరాయదిన్నె

పశుగ్రాసం కోసమే



ఒకటిన్నర ఎకరా పొలంలో వేరుసెనగ సాగు చేశా. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఒబ్బిడి చేస్తున్నాం. రూ.25 వేలు ఖర్చు చేశాం. ప్రస్తుత దిగుబడులతో రూ.7 వేలకు మించి వచ్చే పరిస్థితి లేదు. కేవలం పశువులకు గ్రాసమైనా దక్కుతుందని వేరుసెనగ పంట నూర్పిడి చేస్తున్నాం. వర్షాలు నిలకడ లేకుండా కురిస్తే వేరుసెనగ చెట్లు కూడా దక్కవు.

– సావిత్రమ్మ, వేరుసెనగ రైతు, హనుమంతరాయదిన్నె.

చంద్రబాబు కోసం యుద్ధమే చేశాం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: 2024 ఎన్నికల్లో తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు కోసం కుప్పం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు యుద్ధం చేశారని, దాని ప్రతిఫలమే దేశం మెచ్చిన నాయకుడిని రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేయగలిగామని ఆర్టీసీ వైస్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో తెదేపా శ్రేణులు ఎన్నో దాడులు, అక్రమ కేసులు, ఆస్తుల ధ్వంసం వంటి వాటితో పలు విధాలుగా నష్టపోయారన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు కుప్పం అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని వివరించారు. ఏళ్లుగా కష్టపడి పని చేసిన వారికి పదవుల కల్పనలో ప్రాధాన్యత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కల్పిస్తారని అన్నారు. కుప్పం పురపాలిక ఎన్నికల్లో గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి నాయకులు కుట్రలు, కుతంత్రాలు చేసి గెలిచారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తెదేపాకు 13 వేల పైచిలుకు మెజారిటీ పురపాలిక ప్రజలు అందించారన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, శాంతారామ్, సత్యేంద్రశేఖర్, చెక్కునత్తం మణి, సుబ్బు తదితరులు ఉన్నారు.



ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నంను సన్మానిస్తున్న తెదేపా శ్రేణులు

స్వచ్ఛతతో పర్యావరణకు రక్షణ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు, మండల పరిధిలోని నడుమూరు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం కుప్పం రైల్వే స్టేషన్, బస్టాండులో శ్రమదానం నిర్వహించారు. రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంగణాల్లో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పురపాలిక కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో కళాశాల కేడీసీ వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధారాణి, ఎన్ఎస్ఎస్ అధికారి నగేష్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా సాహిత్యాన్ని చదవాలి



కీలపట్లలో గుర్రం జాషువా జయంతిలో విద్యార్థులు

గంగవరం, న్యూస్‌టుడే: గుర్రం జాషువా సాహిత్యాన్ని నేటి యువత చేత చదివించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు పేర్కొన్నారు. శనివారం కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా రచించిన సత్యహరిశ్చంద్ర, గబ్బిలం, ఫిరదౌసి, శిశువు, గాంధీజీ, నేతాజీ, కాందీశీకుడు, తెలుగుతల్లి, క్రీస్తు చరిత్ర లాంటి రచనలను నేటి విద్యార్థులకు పరిచయం చేయవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామోదరం, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగంలో జాషువా జయంతిని నిర్వహించారు. శనివారం తెలుగు విభాగ అధిపతి వాసు ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కవితలతో అలరించారు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గుర్రం జాషువా తన కవితల ద్వారా అలరించారని తెలుగు సాహితీ సంఘం అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతిని ప్రధాన ఉపాధ్యాయుడు నకిరుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదుంలో పాదయాత్ర చేస్తున్న బీసీవైసీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

తిరుమల పవిత్రత కాపాడాలి

సదుం, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చేపట్టిన పాదయాత్ర శనివారం సదుంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలికారు. స్వామివారికి సమర్పించే లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందన్నారు. ఈ నెల 30న అలిపిరి చేరుకుని మెట్ల మార్గం ద్వారా స్వామివారిని దర్శించుకొనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీవైపీ నాయకులు, స్వామివారి భక్తులు పాల్గొన్నారు. సదుం, కల్లూరులో పాదయాత్ర కొనసాగింది. ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

'నెయ్యిని అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

చౌడేపల్లె, న్యూస్‌టుడే: తిరుమల ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యిని కల్తీ చేసి అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల భాజపా అధ్యక్షుడు మనోహర్ తెలిపారు. శనివారం భాజపా నాయకులు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఐటిమోర్చా జిల్లా కార్యదర్శి గందోడి ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై పర్యవేక్షణ అవసరం

సోమల, న్యూస్‌టుడే: విద్యార్థుల పట్ల తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని ప్రిన్సిపల్ గంగాధర్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చరవాణి, టీవీలు చూడకుండా శ్రద్ధవహించి చదువుకొనేలా చూడాలన్నారు. అధ్యాపకులు తల్లిదండ్రులు, విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు.

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని ఇటుకనెల్లూరు గ్రామంలో మురుగు నీటికాలువల్లో చెత్త పేరుకుపోయింది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- వెంకటరమణ, ఇటుకనెల్లూరు**

సమాధానం: గ్రామంలోని మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి పారిశుద్ధ్య చర్యలు చేపడుతాం. **- బసవరాజు, పంచాయతీ కార్యదర్శి, నెక్కుంది**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: పట్టణం రాజీవ్ కాలనీ కూడలి నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు మురుగునీటి కాలువలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీని కారణంగా వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.- **రవి, కుప్పం**

సమాధానం: రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేలా సిబ్బందిని ఆదేశిస్తాం. శాశ్వత మురుగునీటి కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.- **శ్రీనివాసరావు, కుప్పం పురపాలిక కమిషనర్**

వీధి దీపాలు మరమ్మతు

స్పందనకు వందనం

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని నగరివీధి, బజారువీధిలో వీధి దీపాలకు తాత్కాలిక మరమ్మతులు చేయడంతో వెలుగుతున్నాయి. ఈ నెల 27న మేమున్నాం మీకు తోడుగా శీర్షికతో ఈ ప్రాంతాల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదని వార్త ప్రచురితమైంది. సమస్యను కమిషనరు మధుసూదనరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది సహకారంతో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.



రోడ్డు దిగాలంటే గుబులు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి పుంగనూరు-బెంగళూరు మార్గంలోని డాన్‌బోస్కో స్కూల్ సమీపంలో ఇరువైపులా రోడ్డు కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఎదురెదురుగా వాహనాలువస్తే రోడ్డు దిగాలంటే చోదకులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రమాదాలు జరిగిన సందర్భాలు లేకపోలేదు. రోడ్డుకు ఇరువైపులా మట్టితోలించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ర.భ.శాఖ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రోడ్డును పరిశీలించి మరమ్మతులకు చేయించేందుకు చర్యలు చేపడుతామన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మండల వైకాపా నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఈ పూజలు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు తెలిపారు. నాయకులు ఎంపీపీ రామ్మూర్తి, కల్యాణభరత్, కృష్ణరెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఓబులేశు, రుక్మిణమ్మ పాల్గొన్నారు. **సదుంలో..** మండలంలోని కొత్తపల్లె, జోగివారిపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. శ్రీవారి లడ్డుపై విషప్రచారం చేస్తున్న కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ పూజలు జరిపించినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ధనంజయరెడ్డి, రమణారెడ్డి, రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.



గుడుపల్లె: దుకాణాలు ఏర్పాటు చేసుకున్న పీబీవాడ బస్‌షెల్టర్

ఆక్రమణలో బస్‌షెల్టర్

పెద్దబదనవాడ(గుడుపల్లె), న్యూస్‌టుడే: గుడుపల్లె మండలం కుప్పం-గెసికపల్లె ప్రధాన మార్గం పెద్దబదనవాడ కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.లక్ష వ్యయంతో చిత్తూరు ఎంపీ దివంగత రామకృష్ణారెడ్డి ఎంపీ నిధులతో బస్ షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం బస్ షెల్టర్ ప్రయాణికులకు దూరమై పరుల పాలు కావడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్రమణకు గురైన బస్ షెల్టర్ విషయమై ప్రజావేదికలో జిల్లా పరిపాలనాధికారి సుమిత్ కుమార్‌కు పలువురు ప్రయాణికులు వినతి పత్రం ఇచ్చారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు దురాక్రమణ నుంచి బస్‌షెల్టర్లలోని ఆక్రమణలను తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అక్రమంగా పూడ్చిన కాలువ

చౌడేపల్లె-పుంగనూరు ప్రధాన రహదారికి పక్కన భూముల ధరలకు రెక్కలు రావడంతో కాలువలు సైతం అక్రమార్కులు పూడ్చి వేస్తున్నారు. రహదారి పక్కన గల ప్రైవేటు స్థలాలను రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తారు. కోట్లు ఖర్చుచేసి ఇళ్లు నిర్మిస్తారు. వారి ఇళ్లకు దారికోసం చెరువులకు నీటిని అందించే కాలువలను పూడ్చేస్తున్నారు. చిట్రెడ్డిపల్లె చెరువు, చౌడేపల్లె చెరువు నుంచి వచ్చే నీటిని అందించే కాలువను పూడ్చి వేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దారు హనుమంతును వివరణ కోరగా అక్రమాలను తొలగించి కాలువలను కాపాడతామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, చౌడేపల్లె

'సీఎం అసత్య ప్రచారం మానుకోవాలి'

బంగారుపాళ్యం: తిరుమల లడ్డుపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసత్య ప్రచారం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చెప్పారు. వైకాపా అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో వైకాపా నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర, మాజీ జడ్పీటీసీ కుమార్‌రాజా, మండల కన్వీనరు రామచంద్రారెడ్డి, జిల్లా సేవా దళ్ అధ్యక్షులు కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు వితరణ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.కొత్తూరులో నిర్మిస్తున్న నడివీధి గంగమ్మ ఆలయ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం సినిగిపల్లెకు చెందిన ప్రకాష్‌రెడ్డి రూ.50 వేలు వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులకు విరాళదాత, సినిగిపల్లె గ్రామస్థులు వెంకటేష్, మణి శనివారం నగదును అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతను నిర్వాహకులు సత్కరించారు.



రూ.50 వేలు వితరణ చేస్తున్న దాత ప్రకాష్‌రెడ్డి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తమిళులకు పవిత్రమైన పెరటాశి నెల రెండో శనివారం సందర్భంగా మురారిపల్లె శ్రీఓబులేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు తిప్పాచార్యులు స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణతో పూజలు, అర్చనలు చేశారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. కడపనత్తం శ్రీనలగుండ్రాయ స్వామి, బైరెడ్డిపల్లె శ్రీశేషాద్రిస్వామి, పెద్దపురం శ్రీవెంకటేశ్వర స్వామి, పట్నపల్లె శ్రీకల్యాణ వెంకటరమణస్వామి ఆలయాల్లో అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు.



పాటలు పాడుతున్న కళాకారులు

ఆకట్టుకున్న నాదనీరాజనం

పలమనేరు, న్యూస్‌టుడే: గంగవరం మండలం కీలపట్ల గ్రామంలోని శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల సందర్భంగా చేపట్టిన నాదనీరాజనం భక్తులను ఆకట్టుకుంది. పెరటాసి నెల రెండో శనివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా బెంగుళూరు అన్నమాచార్య సంకీర్తన బృందం కీర్తలను ఆలపించారు. గానసుధా సంగీత కళాశాల అధ్యాపకులు రమ్యసుధీర్ మిత్రబృందం కీర్తనలను ఆలపించారు. భక్తులకు శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రత్యేకాలంకారంలో కల్యాణ వేంకన్న

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. పెరటసి మాసంలో రెండో శనివారం కావడంతో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటరమణస్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆర్థిక సహాయం అందజేత

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని చింపిరెడ్డిపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌నాయుడు గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం ఎంఈవోలు శ్రీరాములు, శివరత్నమ్మ, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, ఉపాధ్యాయులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రభుత్వం ద్వారా రూ.25 వేలు అందజేశారు.

అవగాహన సదస్సు

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు లేఔట్‌లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఏఈ త్యాగరాజ్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, బిల్లులు చెల్లింపులకు ఇబ్బంది లేదన్నారు. ఏపీఎం రమేష్, ఏపీవో ఎస్ షౌకత్‌ఆలి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కల్లూరు, పులిచెర్ల, మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాల, మంగళంపేట, ఎల్లంకివారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 43 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో మదన్ సుమన్(మొదటి), కుషన హాజ్(ద్వితీయ), రక్షిత(తృతీయ) విజేత రాధిక(నాలుగు)స్థానాల్లో గెలుపొందారు. కార్యక్రమంలో ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్‌ఉపాధ్యాయులు నానికా నాయక్, గోపీ, సరిత పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విజేతలు

మద్యం స్వాధీనం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: విక్రయించేందుకు సిద్ధంగా పెట్టుకున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని శనివారం అరెస్టు చేసినట్లు పెద్దపంజాణి ఎస్సై సహదేవి తెలిపారు. నిడిగుంట గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంను అరెస్టుచేసి 96 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుడిని పుంగనూరు కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.